కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ


నేరడిగొండ: ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: గ్యారంటీల పథకాల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. మండల కేంద్రంలోని స్థానిక రైతువేదికలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలనలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఆరు గ్యారంటీలే కాకుండా ఇతర సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం సావర్గాం గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ హయాంలో మంజూరైన రూ.20లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో నేరడిగొండ, ఇచ్చోడ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతంరెడ్డి, సర్పంచులు పెంట వెంకటరమణ, జాదవ్ కళ్యాణి మహేందర్, నాయకులు దేవేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, పండరి, శంకర్ నానక్‌సింగ్, ప్రతాప్‌సింగ్, భీంరెడ్డి, శివారెడ్డి, జహీర్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ప్రజాపాలన గ్రామసభల ద్వారా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో మంగళవారం ఆయన దరఖాస్తులను పరిశీలించారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, సర్పంచ్ చౌహాన్ సునీత పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డులో..

ఇచ్చోడ మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ లబ్ధిదారులతో కిక్కిరిసిపోయింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామస్తులు కౌంటర్ల వద్ద లైన్‌లో నిల్చున్నారు. అధికారులు 32 కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్ గ్రామసభను పరిశీలించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంద్రవెల్లి: ప్రజాపాలనలో దరఖాస్తు స్వీకరణలో ప్రజలకు ఆందోళన వద్దని ప్రతి ఒక్కరి దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని డొంగర్‌గామ్, వాల్గొండ పంచాయతీల్లో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు గ్యారంటీల దరఖాస్తు ఫారాలు ఎలా నింపాలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచులు రాథోడ్ రాంచందర్, కినక జుగాదిరావ్, పంచాయతీ కార్యదర్శులు రాథోడ్ హితేష్, జీవన్‌రావ్, గ్రామపటేల్ పెందోర్ బాదు పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణలో భాగంగా మంగళవారం కుమారి గ్రామంలో దరఖాస్తు ఫారాలు అందలేదంటూ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు అక్కడికి చేరుకుని దరఖాస్తు ఫారాలు వారికి అందించడంతో శాంతించారు. అనంతరం దరఖాస్తులు చేసుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, ఎస్సై సాయన్న, సర్పంచ్ ఒర్స రాజు యాదవ్, గడ్డం నరేశ్‌రెడ్డి ఉన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంతోపాటు తర్నం(కె), సావర్గాం రోడ్, బుగ్గారం గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

బోథ్: మర్లపెల్లి, కరత్వాడ, ధన్నూర్ బి గ్రామాల్లో ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీవో జీవన్‌రెడ్డిలు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

బేల: సాంగిడి, పాటన్, పిఠగావ్(ఎల్), పోనాల గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శంకర్, ప్రత్యేక కౌంటర్ల ద్వారా అధికారులు స్వీకరిస్తున్న దరఖాస్తులపై ఆరా తీశారు. ప్రతీ దరఖాస్తుకు రసీదు అందించాలని సూచించారు. ఎంపీడీవో మహేందర్‌కుమార్, తహసీల్దార్ సవాయ్‌సింగ్, ఎంపీవో సమీర్ హైమద్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తలమడుగు: ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి సూచించారు. సుంకిడి, తలమడుగు, కప్పర్ది దేవి, గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులు స్వీకరించారు. నోడల్ ఆఫీసర్ మహావీర్, ఎంపీడీవో రమాకాంత్, తహశీల్దార్ రాజ్ మోహన్ ఉన్నారు.

దరఖాస్తుల కోసం పడిగాపులు

గుడిహత్నూర్: స్థానిక రైతు వేదిక వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద దరఖాస్తుదారులు ఫారాల కోసం పడిగాపులు కాశారు. ఉదయం 9 గంటల వరకే 1500 ఫారాలు అందించారు. అయినా సరిపోకపోవడంతో తరలివచ్చి అధికారులను నిలదీశారు. అప్పటికే సిబ్బంది ద్వారా జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ నుంచి ఫారాలు తెప్పించడానికి పంపించారు. ఈ క్రమంలో రెండు గంటల పాటు వారు క్యూలో నిల్చున్నారు. ఎట్టకేలకు వచ్చిన మరో 1500 దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. దీంతో మండల కేంద్రంలో తొలిరోజు 3వేల దరఖాస్తు ఫారాలు అందించినట్లు అధికారులు తెలిపారు. అయితే రైతు వేదిక వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ నాగేందర్ చేరుకుని అధికారులతో మాట్లాడి ఫారాలు అందేలా చూడాలన్నారు. సర్పంచ్ జాదవ్ సునీత, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఏవో రేవతి, ఎంపీవో లింగయ్య, ఏఈవో వెంకటి, కార్యదర్శులు చక్రవర్తి, మోతీరాం, అంగన్వాడీ కార్యకర్తులు, ఐకేపీ సిబ్బంది, ఆశ వర్కర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

తాంసి: తాంసి మండలంలోని కప్పర్ల, గోట్కూరి గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీడీవో భూమయ్య, తహసీల్దార్ లక్ష్మి ఉన్నారు. భీంపూర్ మండలంలోని నిపాని, కరంజి(టి) గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్, తదితరులు కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కరంజి(టి)లో 550, నిపానిలో 490 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. సర్పంచులు సదానంద్, రోహిత్, రాజన్న, సాత్విక నరేందర్, ఎంపీవోలు సుధీర్‌రెడ్డి, వినోద్, కార్యదర్శులు పాల్గొన్నారు.


ఇచ్చోడ: క్యూలో లబ్ధిదారులు


ఇచ్చోడ: దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


గుడిహత్నూర్: అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేందర్


నేరడిగొండ: దరఖాస్తు ఫారాల కోసం గ్రామస్తుల నిరసన


బోథ్: దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీవో


బేల: పాటన్ గ్రామంలో..


ఇంద్రవెల్లి: డొంగర్‌గామ్‌లో..


తలమడుగు: దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీటీసీ

క్లుప్తంగా

కుస్తీపోటీల్లో సత్తా


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నార్నూర్: మండలంలోని జామ్‌డా బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.మౌనిక, ఎం.త్రిసా, బి దేవశాల కుస్తీ పోటీలో సత్తా చాటినట్లు హెచ్‌ఎం చౌహాన్ నెహ్రూ, పీడీ ఆడే విశ్వనాథ్ తెలిపారు. ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో జిల్లాస్థాయి ఇంటర్ సొసైటీ లీగ్ సెలక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రెజ్లింగ్ కుస్తీ పోటీల్లో 60 కిలోల విభాగంలో మౌనిక, 57 కిలోల విభాగంలో త్రిసా, 68 కిలోల విభాగంలో దేవశాల ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. క్రీడా జిల్లా అధికారి పార్థసారథి, పీడీలు లక్ష్మి, ఆర్.గోపాల్, ఆర్.శ్రీనివాస్, మధుసూదన్, రవి, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

పీఆర్టీయూతోనే టీచర్ల సమస్యలు పరిష్కారం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తలమడుగు: దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తలమడుగు ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సంఘం నూతన క్యాలెండర్ మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణ, మండల ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ ఆఫీసర్ జి.వెంకట్‌రావ్, ఎంపీఈవో దిలీప్, పీఆర్టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంగారపు మహేందర్ యాదవ్, నర్ర నవీన్ యాదవ్, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ స్వామి, వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు బి.గంగయ్య, వినోద్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశానికి బయల్దేరిన బీఆర్‌ఎస్ శ్రేణులు


హైదరాబాద్‌కు వెళ్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కై లాస్‌నగర్: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించనున్న ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి బీఆర్‌ఎస్ శ్రేణులు బయల్దేరి వెళ్లారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ నేతృత్వంలో కార్యకర్తలు మంగళవారం జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారని ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తెలిపారు. నాయకులు విజ్జగిరి నారాయణ, దాసరి రమేశ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఆయన స్వగ్రామమైన మండలంలోని రాజుర గ్రామంలో గల శ్రీ జగదాంబదేవి సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఆలయాల్లో పూజ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆధ్యాత్మికత పెరుగుతుందన్నారు. యువకులు చెడు వ్యసనాలకు వెళ్లకుండా ఉండేందుకు ఇదే సరైన మార్గమని తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు ప్రజాపాలన గ్రామసభలు

నేరడిగొండ: మండలంలోని నాగమల్యాల్, పీచర, వడూర్, కుంటాల(కె), వెంకటాపూర్, వాగ్దారి గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మంత్రులను కలిసిన గజేందర్


పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న గజేందర్

బోథ్: రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖలను హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుడు ఆడె గజేందర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. నియోజకవర్గంలోని సమస్యలను మంత్రులకు వివరించినట్లు గజేందర్ పేర్కొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు


ఊరేగింపుగా తీసుకెళ్తున్న అక్షింతలు

తాంసి: మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి అయోధ్య అక్షింతలను మంగళవారం ఊరేగింపుగా గ్రామాలకు తీసుకెళ్లారు. సర్పంచులు, గ్రామపెద్దలు పూజలు అనంతరం ఊరేగింపుగా వెళ్లారు. గ్రామాల్లో ఇంటింటా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తాంసి సర్పంచ్ కృష్ణ, సర్పంచులు కేశవ్‌రెడ్డి, శ్రీనివాస్, గ్రామపెద్దలు రఘు, లింగారెడ్డి నర్సింగ్ పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న సిడాం రాంకిషన్

ఎదులాపురం: ఆదివాసీ పర్ధాన్ తెగకు చెందిన తనకు బీజేపీ నుంచి ఆదిలాబాద్ ఎంపీ టికెట్ కేటాయించాలని అఖిల భారతీయ ఆదివాసీ పర్ధాన్ జనజాతి సంఘటన్ జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్ కిషన్ కోరారు. జిల్లాకేంద్రంలోని మంగళవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బీజేపీలో గోండు తెగకు చెందిన వారికి టికెట్లు కేటాయించాలన్నారు. తమ పర్ధాన్ సమాజం సామాజికంగా, రాజకీయంగా ఎదగలేకపోతుందన్నారు. తాను బీజేపీకి వ్యక్తిగతంగా ఎన్నో సేవలు చేశానని గుర్తుచేశారు. సంఘటన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కల్పించాలి


ప్రజావేదికలో సామాజిక తనిఖీ నివేదిక వివరిస్తున్న డీఆర్పీలు

- డీఆర్‌డీవో కిషన్

ఇంద్రవెల్లి: ఉపాధి పథకం ద్వారా కూలీలందరికి పని కల్పించాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. ఎంపీడీవో కార్యలయ ఆవరణలో ఎంపీపీ పోటే శోభాబాయి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికకు ఆయన హాజరయ్యారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ.7.40 కోట్లతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి నివేదికను డీఆర్పీలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో కిషన్ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఎలాంటి అవకతవకలతోపాటు అక్రమాలు జరగలేదన్నారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఎంపీడీవో పుష్పలత, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, ఎంపీటీసీలు గిత్తె ఆశాబాయి, సర్పంచులు కోరెంగా గాంధారి, శారద, పార్వతిబాయి, విజయ, ఆర్క పులబాయి, ఎంపీవో సంతోష్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్, టీఏలు పాల్గొన్నారు.

ఐటీ టవర్ నిర్మాణంతో యువతకు ఉపాధి

- మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్


పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

కై లాస్‌నగర్: ఐటీ టవర్ నిర్మాణంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణ శివారులో నిర్మిస్తున్న ఐటీ టవర్ పనులను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఐటీ టవర్ నమూనాను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ టవర్ నిర్మాణం పూర్తయితే 2 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్‌లో ఐటీ సేవలు ప్రారంభం కావడంతో అనేక మంది యువతకు ఉపాధి లభించిందని తెలిపారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా పనులు పూర్తి చేయాలని, ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేతృత్వంలో ఆదిలాబాద్‌కు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్, నర్సింగ్, వ్యవసాయ కళాశాలలు మంజూరైన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన వెంట కలీం, సునీల్, మహేష్, చందర్ పాల్గొన్నారు.

పల్లె దవాఖానా ప్రారంభమెప్పుడో?

నేరడిగొండ: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు పల్లె దవాఖానా పేరిట మండలంలోని వాంకిడిలో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనం పూర్తయి ఏడాది గడిచినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. అధికారులు పట్టించుకుని వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ సభ్యులు

బోథ్: మండల కేంద్రంలోని మంగళవారం బోథ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఎన్‌ఎస్‌యూఐ సభ్యులు మహేందర్, జఫర్, కిరణ్‌రెడ్డి, గౌతంరెడ్డి ప్రారంభించారు. మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కాగా, ఈ జట్లకు మీర్ ఇర్షాద్ అలీ బ్యాట్లు అందజేశారు. క్రీడాకారులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉర్దూ భవన్‌కు మరమ్మతు చేపట్టాలి

ఎదులాపురం: జిల్లాకేంద్రంలో శిథిలావస్థకు చేరిన ఉర్దూ భవన్‌కు వెంటనే మరమ్మతు చేపట్టాలని కాంగ్రెస్ నాయకుడు ఫయాజ్ షమా అహ్మద్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉర్దూ భవన్‌ను ఆధునీకరించాలని బుధవారం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. రఫీక్, బబ్లూ, ఫయాజ్, నస్రీమ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు

తాంసి: విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం భీంపూర్ మండలంలోని కరంజి(టి) జెడ్పీ ఉన్నత పాఠశాలకు 10 కంప్యూటర్లు అందించింది. మంగళవారం పాఠశాలకు చేరిన కంప్యూటర్లను హెచ్‌ఎం రాధాక్రిష్ణ, కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు నారాయణరావు పాటిల్ పరిశీలించారు.

గిరిజనులకు వైద్యపరీక్షలు

తాంసి: భీంపూర్ మండలంలోని గుంజాల, రాజుల్‌కోరి, గుబిడిపల్లి గ్రామాల్లో గిరిజనులకు మంగళవారం వైద్యపరీక్షలు చేశారు. భీంపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌రాజ్ ఆధ్వర్యంలో సికిల్‌సెల్ అనీమీయా పరీక్షల్లో భాగంగా సిబ్బంది గుంజాలలో 29, గుబిడిపల్లి 30, రాజుల్‌కోరిలో 45 మందిని పరీక్షించారు. గిరిజన గ్రామాల్లో ఈనెల 15 వరకు వైద్యపరీక్షలు ని ర్వహిస్తామని తెలిపారు. హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్ ఉన్నారు.

సీపీఐ నాయకుడు మృతి

తాంసి: మండలకేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు ముత్తన్న (69) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. గ్రామంలో సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియల్లో జిల్లా నాయకుడు విలాస్, మండల నాయకులు పాల్గొని మృతదేహం పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

న్యూ ఇయర్ శుభాకాంక్షలు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ బాధ్యులు


పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్


ఐటీడీఏ పీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు


పుష్పగుచ్ఛం ఇస్తున్న సంఘ బాధ్యులు

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ దండె విఠల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దండె విఠల్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి కొత్త సంవత్సరంలో అంతా మంచి జరగాలని కోరారు. అదేవిధంగా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈఈ భీంరావు, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్: తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్, డాక్టర్లు శ్రీకాంత్, హరీష్ కుమార్, వంశీకృష్ణ, స్వామి, అవినాష్, సర్వరాజ్ ఉన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసిన నాయకులు

కై లాస్‌నగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి కృష్ణ, అల్లాడి రఘురాం, నాయకులు బ్రహ్మానందరెడ్డి, రాథోడ్ రవీందర్, రమణచారి, శ్రీకాంత్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.